# భా.బా.స!

సిటీలో వున్న కాలనీలలో కెల్లా సదానందనగర్ కాలనీ అతిపెద్దది!

ఆ కాలనీలో సీనియర్ సిటిజన్స్ సంఖ్య ఎక్కువే. సీనియర్ సిటిజన్స్ అంతా వారానికి ఒకసారి బాబురావుగారింట్లో సమావేశమవుతుంటారు.

బాబురావు అంటే జమీందారేం కాదు. రమారమి డెబ్భై యేళ్లుంటాయేమో. మనిషి ఆరోగ్యంగా చలాకీ వుంటారు.

సర్వీసులో వుండగానే భార్య కాలం చేసింది.

ఆమె పోకముందే ఇద్దరి ఆడపిల్లలకూ పెళ్ళిళ్ళు అయినయ్. ఒకే ఒక్క మగపిల్లాడి వుద్యోగం, నివాసం అమెరికాలో. డాలర్లు సంపాదించడంలో బాబురావు కొడుకు మునిగితేలుతున్నాడు. పెళ్ళయి నెల్లోపలే పెళ్ళాన్ని తనతోపాటు విమానంలో అమెరికా తీసుకెళ్ళాడు. ఏడాదికోసారి ఫ్యామిలీతో ఇండియాలో వాలి ఒంటరి తండ్రిని చూచిపోతుంటాడు. ఆఫ్‌కోర్స్ నెలనెలా డాలర్స్ తండ్రి అవసరాలకు మించే పంపుతుంటాడు.

బాబూరావు గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్లో జాయింట్ డైరెక్టర్ చేస్తూ సూపరాన్యుయేషన్ మీద రిటైరైనాడు.

కాలనీలో సొంత ఇల్లుంది! నెల నెలా పదివేలకి పైచిలుకే పింఛనొస్తుంది. ఇంట్లో వండి వార్చేందుకు వంట మనిషి. మిగతా పనులు చూసుకోవడానికి పనిమనిషి వున్నారు.

దిగులు, చీకూచింతా లేని మనిషి బాబూరావ్. కొడుకు అమెరికా రమ్మనమని ఎన్నిసార్లు ఆహ్వానించినా ఛీ! రాను పొమ్మన్నాడు. ఇండియాలో అందునా... హైదరాబాద్ నీరు తాగుతూ గాలి పీలుస్తూ తుదిశ్వాస విడవాలనేది ఆయనగారి చివరి కోరిక!

సిల్క్ జుబ్బా... పొందూరు ఖద్దరు పంచ... నోట్లో రూళ్ళకర్రంత సిగార్... చేతిలో స్టిక్‌తో... స్వయంగా కారు నడుపుతూ జల్సాగా సిటీ అంతా తిరుగుతాడు. ట్యాంక్‌బండ్ మీద నిలబడి ఆకాశంలోకి... బుద్ధుడి విగ్రహాన్ని తదేకంగా చూస్తూ... ఎదురు వరుసలో వున్న మహనీయుల శిలావిగ్రహాలను చూస్తూ కాలక్షేపం చేసే అలవాటు!

ఇహ కథలోకి వద్దాం...

సీనియర్ సిటిజనంటే... కన్నబిడ్డలకే కాదు కట్టుకున్న భార్యక్కూడా గౌరవం లేకుండా పోతోంది... వాపోయాడు భైరవరావ్.

ఆరోజు ఆదివారం కావటాన బాబూరావు ఇంట్లో సీనియర్ సిటిజన్స్ అంతా వచ్చి వాలారు.

వెరసి మొత్తం పాతికమంది దాకా సభ్యులుంటారు.

'అసలు ఈ ఆడవాళ్ళున్నారు చూశావ్... మహా తెలివైనవాళ్ళు! కాస్తంత చనువిస్తే చాలు నెత్తికెక్కేస్తారు. ఓ స్టేట్‌మెంట్ పారేశాడు జోగినాథం. ఇతగాడు ఆడవాళ్ళ విషయాల్లో మహాస్ట్రిక్ట్! సూదిమొనంత అవకాశం కూడా ఈయడు. భార్యనైనా సరే ఆమడదూరంలో వుంచుతాడు. అందుకే ఆయనగారి శ్రీమతి జోగినాథం చెప్పిన దానికల్లా గంగిరెద్దులా తలాడిస్తుంది. ఆ మహాఇల్లాలు నోరే మెదపదు. నలభై యేళ్ళ సంసారంలో తినటానికి తప్పించి నోరు తెరిచి ఎరగదు. పెళ్ళయిన క్షణం నుంచీ పెళ్ళాన్ని అదుపాజ్ఞల్లో వుంచాడు. ‹·మీ విషయం!.

'ఆడవాళ్ళు వంటింటికి... అప్పుడప్పుడు పిల్లల్ని కనడానికి ... రోజూ భర్తకి సేవ చేయడానికి పరిమితంగా వుంటేనే బాగుంటుంది! మనకు సలహానివ్వగల స్థాయికి వారిని ఎదగనిచ్చామో... మనం చచ్చామన్నమాటే... ఏమంటారు?' ఇటీవలే షష్ఠిపూర్తి చేసుకున్న రాఘవరావు అనుభవంతో కూడిన అభిప్రాయం వ్యక్తం చేసాడు.

'మీరు చెప్పేది అక్షరాలా నిజం! ఈషణ్మాత్రం అబద్ధం కాదు. కానీ నా పరిస్థితి అందుకు భిన్నం! పెళ్ళయిన కొత్తలో భార్య కదాని... ముద్దూ మురిపెంతో చనువిచ్చి నెత్తికెక్కించుకున్నాను. అదే నే చేసిన తప్పయింది. అది మొదలు భార్యామణి నా నెత్తికెక్కి భరతనాట్యం చేయడం ప్రారంభించింది. ఇంటి పెత్తనమంతా చేతిలోకి తీసుకుని ఇష్టారాజ్యంగా పాలిస్తోంది. నేనన్నా... నా మాటన్నా... వెంట్రుకతో సమానంగా తీసిపారేస్తున్నదనుకోండి! అంతా నా ప్రారబ్ధకర్మ...' తన గోడు వెళ్ళబోసుకున్నాడు పార్వతీశం.

'అది సరేనండీ... నా పరిస్థితి మరీ విడ్డూరంగా వుంటుంది. చెప్పుకోవడానికి సిగ్గుతో చచ్చిపోతున్నాను. ఆ మహాతల్లి... అదే నా సహధర్మచారిణి నాకు కడుపునిండా ఏనాడూ తిండి పెట్టి ఎరుగదు. లావెక్కుతారు. ఎక్కితే బిపి వస్తుంది. ఆ తర్వాత కొవ్వెక్కువై గుండెజబ్బులొస్తాయంటూ నా కడుపు మాడ్చేది. రిటైరయ్యాక నా పరిస్థితి మరీ దారుణమైంది. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది...' పళ్ళు పటపట కొరుకుతూ నొసలు చిట్లించి మరీ చిటపటలాడేడు ఏకనాథం.

ఏకనాథం ఏదో ప్రైవేట్ కంపెనీలో నలభైయేళ్ళ చాకిరీ చేసి పించను సదుపాయం లేకపోవడాన వట్టి చేతుల్తో రిటైరయిన దురదృష్టవంతుడు.

ఊళ్ళోనే ముగ్గురు కొడుకులున్నా... ఏకనాథాన్ని, అతని భార్యను పిల్చి ఒక్కరోజు కూడా గుప్పెడు మెతుకులు పెట్టిన పాపాన పోలేదు.

కొడుకులు పెట్టక... స్వయంగా తాను, భార్య బ్రతకడం దుర్భరమైన ఈ రోజుల్లో నెలలో పదిరోజులు పస్తులుంటూ చావలేక బ్రతుకుతున్న దురదృష్టవంతుడు. దానికి తోడు భార్య సతాయింపుతో వేగలేక ఇంట్లో వుండాలంటే నరకమనిపిస్తోంది.

బాబూరావు ఇంట్లో చేరిన సీనియర్ సిటిజన్సందరూ ఆ వీధిలోని వారే! వీరికి వేరే పనీ పాట ఏమీ లేకపోవడంతో ఇంట్లో కాఫీ తాగో, తాగకో వేళకి రెండు మెతుకులు తినో, తినకో... సాయంత్రం అయిదు గంటలు కాగానే కావ్... కావ్... మంటూ వచ్చి బాబూరావు

ఇంట్లో మూగుతారు. ఎవరి ఘోష వారు చెప్పుకుంటారు. చీకటి పడగానే పక్షులు గూళ్ళకి చేరుకున్న చందాన ఎవరింటికి వారు వెళ్ళిపోతుంటారు.

అక్కడ సమావేశమయ్యే వారిలో సగంమంది గవర్నమెంట్‌లో ఉద్యోగాలు చేసి రిటైరై హాయిగా దర్జాగా నెల తిరగ్గానే చేతికొచ్చే పింఛనుతో బతుకుతున్నవాళ్ళే. మిగతా సగం మందీ... ప్రైవేట్ ఉద్యోగాలు కావడంవల్ల... నెలసరి ఆదాయం లేక నానా యాతన పడుతూ బతుకు ఈడుస్తున్న వాళ్ళు!

ఎవరింట్లో వారుంటే బోర్ కొడుతుంది. కావున వీరందరినీ ఒకచోట చేర్చే అవకాశం చూపించి పుణ్యం కట్టుకున్న పెద్దమనిషి బాబూరావు.

పాతికమందిలో రమారమి ఇరవై పైచిలుకు వృద్ధులు భార్యా బాధితులు! భార్య గయ్యాళితనంతో వేగలేక చస్తూ బతుకుతూ రోజులు వెళ్ళదీస్తున్న వాళ్ళే!

శ్రీమతి మాటకి ఎదురు చెప్పగల ధైర్యం గలవాళ్ళు కొందరైతే... ఇంటిగుట్టు రోడ్డున పడడం ఇష్టంలేక నోరు మెదపని వాళ్ళు మరికొందరు. తిట్లూ దీవెనలే కాకుండా... పెళ్ళాంతో చీపురుకట్ట తిరగేయించుకున్నవాళ్ళు... మీదపడి గోళ్ళతో రక్కించుకున్న ఘనులు... తొడపాశం పెట్టించుకున్న దీనులు హీనులూ వున్నారు.

ఇన్నేళ్ళుగా అలాంటి ఆడదానితో సంసారం చేసి చేసి... ఇకముందు చేయగల ఓర్పు సహనం నశించినవారి సంఖ్యే అధికం!

సర్వీసులో వుండగా ఎంచక్కా లంచాలు మెక్కినవారు... రిటైరయిన్న తర్వాత పింఛను సదుపాయం లేకపోయినా దర్జాగా బతికేస్తున్నారు. అలాంటి వాళ్ళ సంఖ్య బహుస్వల్పం!

పార్వతీశానికి పిల్లల్లేరు. వయసు మించేక ఇక పిల్లలు పుట్టే అవకాశం లేదని గ్రహించి అన్నగారి కొడుకుని దగ్గరకు తీశారు. అల్లారుముద్దుగా పెంచి చదివించి పెళ్ళి చేసారు.

విడికాపురం పెట్టిన పెంపుడుకొడుకు పెంచిన వారిపట్ల ప్రేమాభిమానాలు లేకపోగా... వారిని పోషించాల్సిన బాధ్యత తనకు లేదని తెగేసి చెప్పి బ్రతికుండగానే తద్దినం పెట్టినంత పనిచేశాడు.

వద్దన్నా అన్నకొడుకుని తెచ్చి పెంచాల్సి వచ్చినందుకు రోజూ కారాలు మిరియాలు నూరిపోస్తూనే వుంది పెళ్ళాం. ఒకవైపు పెంపుడు కొడుకు నిరాదరణ, మరోవైపు కట్టుకున్న భార్య గయ్యాళితనం పార్వతీశాన్ని పిచ్చివాడిని చేస్తోంది.

రిటైరయిన తర్వాత ఇంట్లో కాఫీ తాగి ఎరగడు. బయట ఏ హోటళ్లోనైనా తాగుదామనుకున్నా... జేబులో చిల్లరుండదు. రూపాయి కావాలంటే పెళ్ళాన్ని ముష్టెత్తాల్సిందే. రాక్షసి పెళ్ళాన్ని తిట్టుకోని (మనసులో) క్షణంలేదు.

భార్యాబాధితుల్ని అందరినీ ఆదుకొని తనింట్లోనే ఆశ్రయం కల్పిస్తున్న పెద్దమనసున్న

వ్యక్తి జె.డి.బాబూరావు.

ఇంట్లో పేకాడుకోనిస్తాడు. ఫిల్టర్ కాఫీ సప్లయ్ చేయిస్తుంటాడు. వేడి వేడి పకోడీలు చేయించి పెడతాడు. కష్టాలు భరించడం మరీ దుర్భరంగా వుందనుకున్నప్పుడు... సీసాలకొద్దీ ఫారిన్ సరుకు తెప్పించి దాహం తీరుస్తాడు. చికెన్ బిర్యానీ పెట్టించి కడుపు నింపుతాడు. అందుకే బాబూరావు అంటే అందరికీ అంత ఇష్టం. భార్యాబాధితుల సంఘానికి మహారాజ పోషకుడు బాబూరావు.

★★★★★

బాబూరావు గారింట్లో సాగిస్తున్న వ్యవహారం... ఆటపాటలు... విందు వినోదాలు... గృహిణులపై విమర్శల గురించిన వివరాలు... గడుసు, గయ్యాళి వృద్ధ భార్యల దాకా చేరినయ్.

వయస్సు మీదపడినా మొగుళ్ళ ఆగడాలు మితిమీరుతున్నందుకు వారిపై కారాలు మిరియాలు నూరడమే కాకుండా ఆకాశమంత ఎత్తున మండిపడ్డారు.

'ఏమయ్యా పెద్దమనిషీ... రిటైరయ్యాక పనీపాట ఏం లేదు కదాని మీ ఫ్రెండ్ బాబూరావు ఇంట్లో మీటింగులు పెట్టి మమ్మల్ని ఆడిపోసుకుంటారా? ఇంటి పరువు వీధిన పడేస్తారా? ఉన్నవి లేనివీ చర్చించి భార్యలను అవమానిస్తారా? ఈ వయసులో మీరంతా ఏకమై చేస్తున్న నిర్వాకం ఇదా?' పార్వతమ్మ భర్త పార్వతీశాన్ని కాలర్ పట్టుకొని పైకి లేపి క్లాసు పీకింది.

గుడ్లు మిటకరించి 'అనవసరంగా నామీద దేనికి విరుచుకుపడతావే?' మూరు మాట్లాడేడు.

'మీరేమైనా చిన్నవాళ్ళా? చితకవాళ్ళా? వయసు మీదపడగానే సరిపోదు! కాస్తంత బుద్ధీ జ్ఞానం వుండాలి...' రుసరుసలాడుకుంటూ మరో నాలుగు వడ్డించింది.

'రామ రామ! నా సంగతి తెలీదుటే... ఏదో కాస్త మార్పు కోసం అలా వెళ్ళొస్తున్నాను అంతే...'

'చాల్లెండి మీ నంగనాచి మాటలు... ఇన్నేళ్ళు సంసారం చేసిన నాకు మీగురించి తెలీదా ఏం? గుమ్మం తొక్కారని తెలిస్తే మీ కాళ్ళు విరగ్గొట్టి పొయ్యిలో పడేస్తాను ఏమను కుంటున్నారో?'

'మనకున్నది గ్యాస్ పొయ్యి కదే... కట్టెల పొయ్యి కాదుగా...!'

'ఏంటి జోకా? తాట తీస్తా జాగ్రత్త' పార్వతమ్మ ఫైనల్ వార్నింగ్ ఇచ్చేసింది.

ఈ విధంగా ప్రతిఇంటా తాషామరపాలు మోగాయి. సీనియర్ సిటిజన్స్ అయిన భర్తల సమూహం బిక్కచచ్చిపోయింది.

కుక్కతోక వంకరన్నట్లు... కట్టుకున్న పెళ్ళాం చెడామడా తిట్టినా... ఫైనల్ వార్నింగ్ ఇచ్చినా... సాయంత్రం కాగానే ఎవరి మటుకు వారు చల్లగా ఇళ్ళల్లోంచి జారుకుని బాబూరావు ఇంటికి

చేరుకున్నారు.

ఆరోజు రాత్రి ఏకనాథం పిల్లిలా ఇల్లు చేరుకోవడం చూసి గుమ్మంలోనే మొగుడ్ని నిలేసింది సౌమిత్రి.

'ఎక్కడ్నుంచి మీ రాక?'

పైరుగాలి... రెపరెప... కాస్తంత అట్లా పార్కుకెళ్ళి కాస్సేపు అక్కడ కూర్చుని వార్తలు విన్నాను. కనీసం శనక్కాయలు కొందామన్నా జేబులో చిల్లిగవ్వ లేదుకదా... అందుకే మెల్లగా నడుచుకుంటూ ఇంటికొచ్చాను. అని చెప్పి బిక్కముఖం పెట్టాడు ఏకనాథం.

'నేన్నమ్మను! మీ అందరికీ వున్నాడుగా గురువు!... ఆయన పోసిన తీర్థం తాగి ప్రసాదం పీకలదాకా మెక్కి మరీ వస్తున్నారు. నాకు తెలీదా ఏం? ఏదీ నోరు తెరవండి...' సౌమిత్రి భర్త చెవి మెలేసింది.

మన్నుతినంగనే శిశువునో... ఆకొంటినో... అనే పద్యం గుర్తొచ్చి నోరు బార్లగా తెరిచి మరీ చూపించాడు ఏకనాథం.

'ఈసారికి బతికిపోయారు. మీ బుద్ధులు తెలియవా? మరోసారి నాకు పట్టుబడ్డారంటే గోడ కుర్చీ వేయిస్తాను తెల్లార్లు! బీ కేర్‌ఫుల్...'

పెళ్ళాం ఇచ్చిన వార్నింగ్ ఫుల్ బాటిల్ తాగినంత కిక్కిచ్చింది ఏకనాథానికి.

ఇంకా అక్కడే దేనికి? లోపలికి తగలడండి... సౌమిత్రి అనడంతో సుగ్రీవాజ్ఞగా భావించి... వంటినున్న చొక్కా వంకీకి తగిలించి నవారు మంచం మీద వాలిపోయాడు.

★★★★★

సావిత్రమ్మ గారి డాబా మీద పోగైన వృద్ధ నారీ పతివ్రతలంతా రకరకాలుగా భర్తల గురించి చర్చించుకున్నారు. వారి తిమ్మిరి ఎలా అణగ్గొట్టాల్సిందీ నిర్ణయించుకున్నారు.

చెవి మెలేసినా... తిట్టినా... తిండి పెట్టకుండా ఎండగట్టినా... గోడ కుర్చీ వేయించినా... ఇంకా ఎన్నెన్నో అఘాయిత్యాలకు వొడిగట్టినా భర్తల్లో మార్పు రానందుకు సహాయ నిరాకరణోద్యమం సాగించక తప్పదనే ముగింపు వాక్యం ముక్త కంఠంతో పలికేరు.

'లేచింది మహిళాలోకం' అని పాట పాడకపోయినా... జెండాలు పట్టుకుని నిరసన ప్రదర్శనను ఈయకపోయినా ఇకపై తీసుకోబోయే చర్యలు కఠినాతి కఠినంగా వుండాలని ఏకగ్రీవంగా గయ్యాళి భార్యలంతా తీర్మానించారు.

వార్తాహరులు ఈ విషయాన్ని... నిర్ణయాన్ని సీనియర్ సిటిజన్స్‌కి మోసేసారు. పబ్లిక్ పరీక్షల్లో క్వశ్చన్ పేపర్ లీకైనట్టు అయింది.

ఏళ్ళతరబడీ కాపురం చేసి... పిల్లల్ని కని... సర్వసౌఖ్యాలు అనుభవించాక భార్య

గయ్యాళిదైనా రాక్షసి అయినా ఆమెను... అందునా ఆడదాన్ని వదిలేయలేము కదా?... అట్లా అని ఎదురించి బ్రతకలేము కదా? ఇలాంటి విషమ పరిస్థితుల్లో రాజీపడడం ఒక్కటే సరైన మార్గంగా తోచింది ముసలివాళ్ళకి.

తిట్లు తిన్నా... చీపురు తిరగేయించుకున్నా... తిండి పెట్టినా, ఎండగట్టినా... ఇన్నేళ్ళుగా భరిస్తూ.. సహిస్తూ... వచ్చిన మనం ఇప్పుడు... ఈ వయసులో తిరుగుబాటు చెయ్యడమేమిటి? అని కూడా అనిపించింది.

కుక్కిన పేనులా... కొంగుచాటు కృష్ణుడిలా బ్రతకాలా వద్దా అనే విషయాన్ని సీక్రెట్ బ్యాలెట్ పద్ధతి ద్వారా తేల్చుకోవాలనే అభిప్రాయానికి వచ్చారు.

బాబూరావు ప్రిసైడింగ్ ఆఫీసరయ్యాడు. ఓటింగ్ పూర్తయింది. బ్యాలెట్ పేపర్ల కౌంటింగ్ మొదలైంది.

నెగిటివ్ ఓటు ఒక్కటీ పడలేదు. భార్యా బాధితులంతా తమ భార్యలకు అనుకూలంగానే ఓటేయడం చూచిన బాబూరావు పకపకా నవ్వి... ఓకే చేసేందుకేముంది? మీరంతా ఎవరిళ్ళకు వారు వెళ్ళిపోవచ్చు. గయ్యాళి భార్యతో ఎప్పటిలాగే మనసులో ఇష్టమున్నా లేకపోయినా సుఖంగా కాపుం చేయొచ్చు అంటూ బుల్లి ఉపన్యాసం ఇచ్చాడు.

భార్యా బాధితులు ఎవరిళ్ళకు వారెళ్ళి... ప్రహరీ గేటుకి తాళాలు వేసి వుండడం చూసి అవాక్కయ్యారు.

చలిలో... ఆకలి కడుపులతో తెల్లవార్లూ గేటు బయటే కాపలా కాసారు. సొమ్మసిల్లి పడిపోయారు.

తెల్లారింది...!

కళ్ళు తెరిచేసరికి చీపురుకట్టల్తో భార్యలు వీధిగుమ్మానికి అవతలి వేపు నిలబడి... బుద్ధొచ్చిందా? ఇకనైనా ఇంట్లో తగలడండి! చేతిలో చీపురు చూచి భయం దేనికి? వీధి వాకిలి వూడ్చి కళాపి చల్లి ముగ్గేయడానికి అనడంతో 'హమ్మయ్య' బ్రతుకు జీవుడా అనేసి భర్తలు... అదే భార్యాబాధితులు గృహ ప్రవేశం చేసారు!! భార్యాబాధిత సమాజానికి జై అనుకున్నారు మనసులోనే...

- సమాప్తం -

*(నవ్య వీక్లీ 31-10-07)*